క్లుప్తంగా

భీమేశ్వరాలయ హుండీల రాబడి రూ.9.31 లక్షలు

రామచంద్రపురం రూరల్: దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న ద్రాక్షారామ మాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామి ఆలయ హుండీ ఆదాయం రూ.9,31,231 వచ్చినట్టు ఆలయ ఈఓ పితాని తారకేశ్వరరావు సోమవారం విలేకరులకు తెలిపారు. గత సెప్టెంబరు 30వ తేదీ నుంచి నవంబరు 6వ తేదీ వరకు హుండీల ఆదాయాన్ని లెక్కించినట్టు ఆయన పేర్కొన్నారు. దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వాడ్రేవు సురేష్ పర్యవేక్షణలో జరిగిన లెక్కింపులో దామిశెట్టి గంగాపురుషోత్తం, వాసంశెట్టి శ్యామ్, పోలిశెట్టి కృష్ణ, కంచెర్ల చక్రి, తాపేశ్వరం భీమేశ్వరస్వామి సేవకులు, వేగాయమ్మపేట జమీందారు వాడ్రేవు సుందర రత్నాకర్, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

బాణసంచా విక్రయాలకు అనుమతులు తప్పనిసరి

కాజులూరు: దీపావళీ పండగ పురస్కరించుకుని మండల గ్రామాల్లో బాణసంచా విక్రయాలు చేయాలనుకునేవారు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని గొల్లపాలెం పోలీస్‌స్టేషన్ ఎస్సై ఎం.తులసీరామ్ అన్నారు. సోమవారం పోలీస్‌స్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ అనుమతులు లేకుండా బాణసంచా విక్రయించినా, నిబంధనలు అతిక్రమించినా, సరుకు నిల్వలు ఉంచినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ విషయంపై ఇప్పటికే గతంలో బాణసంచా విక్రయాలు చేపట్టిన నిర్వాహకులకు హెచ్చరికలు జారీ చేశామన్నారు. వ్యాపారులు అమ్మకాల సమయంలోనూ ఉన్నతాధికారుల సూచనలను తప్పనిసరిగా పాటించాలన్నారు. మండల గ్రామాలలో ఎక్కడైనా వాపారులు అనధికారికంగా బాణసంచా నిల్వలు ఉంచితే ప్రజలు తమ దృష్టికి తీసుకురావాలని కోరారు.

'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

కాజులూరు: కాజులూరు అంబేడ్కర్ భవన్‌లో మంగళవారం జరుగనున్న 'వై ఏపీ నీడ్స్ జగన్' (ఆంధ్రప్రదేశ్‌కు జగన్ ఎందుకు కావాలి కార్యక్రమాన్ని కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, గృహసారథులు, వలంటీర్లు విజయవంతం చేయాలని పార్టీ మండల అధ్యక్షుడు గుబ్బల ఏసురాజు అన్నారు. సోమవారం గొల్లపాలెంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ అంబేడ్కర్ భవన్‌లో మధ్యాహ్నం రెండు గంటల నుంచి జరిగే ఈ సమావేశానికి రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార, పౌర సంభందాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, పార్టీ నియోజకవర్గ పరిశీలకులు ఒమ్మి రఘురామ్ ముఖ్య అతిథులుగా హాజరవుతారని తెలిపారు.

విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు



గెలుపొందిన సర్టిఫికెట్లు, జ్ఞాపికలతో ద్రాక్షారామ జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు

రామచంద్రపురం రూరల్: బాలల దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని ద్రాక్షారామ జెడ్పీ హైస్కూల్‌లో సోమవారం విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఏటా జరిగేలా హైదరాబాద్‌కు చెందిన శరత్‌చంద్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ పోటీలను నిర్వహిస్తున్నారు. విజేతలకు ఫౌండేషన్ సీఈఓ ఆకేటి రాణి చేతుల మీదుగా సర్టిఫికెట్లు, జ్ఞాపికలను అందజేశారు. భట్నవిల్లి బీవీసీ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు వలంటీర్లుగా వ్యవహరించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం గుణ్ణం రాజేశ్వరి, ఉపాధ్యాయులు వాడ్రేవు రత్న పద్మావతి, శ్రీమన్నారాయణ, పసుపులేటి మెహర్ సుజాత, అద్దంకి గోవిందరాజు, అరవ విస్సు, కె.జనార్దనస్వామి, జిల్లా సైన్స్ అధికారి గిరజాల వెంకట సత్య సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

వైభవంగా భీమేశ్వరుని శాంతి కల్యాణం



స్వామివారి కల్యాణం చేస్తున్న పండితులు

రామచంద్రపురం రూరల్: హిందూ ధర్మ ప్రచార వారోత్సవాల్లో భాగంగా ద్రాక్షారామ భీమేశ్వర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో సోమవారం జగన్నాయకులపాలెం రామాలయం వద్ద మాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామి శాంతి కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ అనిశెట్టి రామకృష్ణ, అన్నపూర్ణ దంపతుల చేతుల మీదుగా ఈ మహోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నరాల రాజ్యలక్ష్మి, సర్పంచ్‌లు కొత్తపల్లి అరుణ, నక్కిన దొరబాబు, శ్రీ రాజరాజేశ్వరి పీఠాధిపతి సాంబ శివరావు గురూజీ, భక్తులు పాల్గొన్నారు.

నేడు అంగరలో ఎమ్మెల్సీ పర్యటన

కపిలేశ్వరపురం: 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమంలో భాగంగా అంగరలో మంగళవారం ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు పాల్గొననున్నారు. గ్రామంలో సిద్దార్థ కళాశాల వద్ద ఉన్న వీరవెంకట సత్యనారాయణమూర్తి కల్యాణ మండపంలో ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే సమావేశానికి మండలంలోని వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు, సచివాలయ కన్వీనర్లు, నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని నిర్వాహకులు కోరారు.

ఓటు హక్కు.. వజ్రాయుధం

- విజయవంతమైన ఓటు నమోదు శిబిరాలు
- రెండు నియోజకవర్గాల్లో 3,491 దరఖాస్తులు
- కొత్తగా ఓటు కోసం 1,966 మంది అప్లై
- తుది జాబితా జనవరి 5న విడుదల



అంగరలో దరఖాస్తు అందుకుంటున్న బీఎల్ఓ మహ్మద్ ఆలీ తదితర ఉద్యోగులు

కపిలేశ్వరపురం: అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలన్న లక్ష్యంతో ఎన్నికల కమిషన్ కృషి చేస్తోంది. కమిషన్ ఆదేశాలపై ప్రభుత్వం ఓటు నమోదు, తొలగింపులు, సవరణ దరఖాస్తులను స్వీకరిస్తూ రెండు రోజుల పాటు ప్రత్యేక శిబిరాలను నిర్వహించింది. రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల పరిధిలో రామచంద్రపురం ఆర్డీఓ ఆర్.సుధాసాగర్ పర్యవేక్షణలో ఈ శిబిరాలు విజయవంతమయ్యాయి.

పోలింగ్ స్టేషన్ ప్రామాణికంగా ఈ నెల 4, 5వ తేదీల్లో నిర్వహించిన దరఖాస్తుల శిబిరాలు రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల్లో విజయవంతమయ్యాయి. మండపేట నియోజకవర్గంలో 224, రామచంద్రపురం నియోజకవర్గంలో 239 మొత్తం 463 పోలింగ్ కేంద్రాల పరిధిలో దరఖాస్తులను స్వీకరించారు. వీఆర్వో, కార్యదర్శులతో కూడిన బూత్ లెవెల్ అధికారులంతా శ్రమించి ఫారం 6, 7, 8 లను స్వీకరించారు. రెండు రోజుల పాటు ఉదయం 10 నుంచి సాయంత్రం ఐదు వరకూ శిబిరాల్లో దరఖాస్తులను తీసుకున్నారు. సూపర్‌వైజర్లు, సహాయ ఓటరు నమోదు అధికారులు కేంద్రాల్లోని విధులను పర్యవేక్షించారు. అధికారులు దరఖాస్తులను పరిశీలించి జనవరి ఐదో తేదీన తుది జాబితాను విడుదల చేయనున్నారు.

అందిన దరఖాస్తులివీ

నూతనంగా ఓటు హక్కు కోరుతూ ఫారం-6కు సంబంధించి మండపేట నియోజకవర్గంలో 950, రామచంద్రపురం నియోజకవర్గంలో 1,016 మొత్తం 1,966 దరఖాస్తులందాయి. మరణాలు, వలస వెళ్లిన నేపథ్యంలో ఫారం-7 కు సంబంధించి మండపేట నియోజకవర్గంలో 366, రామచంద్రపురం నియోజకవర్గంలో 263 మొత్తం 269 దరఖాస్తులందాయి. తప్పులు సరిచేయడం, అడ్రస్ మార్పులు కోరుతూ ఫారం-8కు సంబంధించి మండపేట నియోజకవర్గంలో 466, రామచంద్రపురం నియోజకవర్గంలో 430 మొత్తం 896 దరఖాస్తులు అందాయి.

మండపేట నియోజకవర్గంలో అందిన దరఖాస్తులు

మండలం	ఫారం-6	ఫారం-7	ఫారం-8	మొత్తం
మండపేట అర్బన్	225	43	204	472
మండపేట రూరల్	298	81	123	502
రాయవరం	310	37	88	435
కపిలేశ్వరపురం	117	205	51	373
మొత్తం	950	366	466	1,782
రామచంద్రపురం నియోజకవర్గంలో..				
ఆర్సీపురం అర్బన్	137	71	85	293
ఆర్సీపురం రూరల్	222	49	106	377
కె.గంగవరం	292	44	185	521
కాజులూరు	365	99	54	51
మొత్తం	1,016	263	430	1,709

అర్హులందరికీ ఓటు హక్కు కల్పిస్తాం



ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఒక ఆయుధం. అర్హత గల అందరికీ ఓటు హక్కు ఇవ్వాలన్న లక్ష్యంతో ఎన్నికల కమిషన్ ఉన్నతాధికారుల ఆదేశాలపై దరఖాస్తులను స్వీకరిస్తున్నాం. ఈనెల 4, 5 తేదీల్లో నిర్వహించిన దరఖాస్తుల స్వీకరణ శిబిరాలు విజయవంతమయ్యాయి. డిసెంబర్ 2, 3 తేదీల్లో ఇదే తరహాల్లో శిబిరాలను నిర్వహించేందుకు సన్నద్ధమవుతున్నాం. స్వీకరించిన దరఖాస్తులను పరిశీలించి ఓటు హక్కు కల్పిస్తాం.

– ఆర్.సుధాసాగర్, ఆర్డీఓ, రామచంద్రపురం

9న శ్రీవారికి నక్షత్ర కల్యాణం

రాయవరం: గ్రామంలో కొలువుదీరిన శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామికి ఈ నెల 9వ తేదీన నక్షత్ర కల్యాణం నిర్వహించనున్నారు. వెంకటేశ్వర భక్త సంఘం ఆధ్వర్యంలో ఆశ్వయజ మాసాన్ని పురస్కరించుకుని కల్యాణానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రతి నెలా స్వామి వారికి నిర్వహించే కళ్యాణంలో భాగంగా ఈ కార్యక్రమం జరుగుతుందని ఆలయ కమిటీ తెలిపింది.

మంత్రి వేణు పరామర్శ



చికిత్స పొందుతున్న ఏజీపీ మురళీని పరామర్శిస్తున్న మంత్రి వేణు

రామచంద్రపురం: స్థానిక బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, ఏజీపీ పిల్లి మురళీమోహన్ వెంకట రమణ ఇటీవల అనారోగ్యానికి గురయ్యారు. కాకినాడ మెడికోవర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మురళీని రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాల కృష్ణ సోమవారం పరామర్శించారు. వైద్యులతో మాట్లాడి ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ నేతలు తదితరులున్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



ధాన్యం నాణ్యతను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, పాపారాయుడు

- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు
- ద్వారపూడిలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

మండపేట: రైతు సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో కార్యక్రమాలను అమలు చేస్తున్నారని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. ద్వారపూడి సొసైటీలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం పార్టీ రాష్ట్ర కార్యదర్శి కర్రి పాపారాయుడు, ఏఎంసీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు, ఎంపీపీ వుండమట్ల శ్రీనివాస్ తదితరులతో కలిసి ఎమ్మెల్సీ తోట ప్రారంభించారు. ఈ సందర్భంగా సొసైటీ చైర్మన్ తులా శ్రీరంగారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దళారుల చేతుల్లో రైతులు నష్టపోకుండా వారికి మద్దతు ధరను అందించేందుకు ప్రభుత్వం ఆర్‌బీకేల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తోందన్నారు. రైతులు నేరుగా ధాన్యం శాంపిల్‌ను ఆర్‌బీకేకు తెస్తే సిబ్బంది తేమ శాతం పరిశీలించి కళ్లం వద్ద నుంచి ధాన్యం కొనుగోలుకు చర్యలు తీసుకుంటారన్నారు. ఉప సర్పంచ్ తులా శేషారావు, పర్సన్లు దండుబోయిన సూర్యనారాయణమూర్తి, ముత్తాబత్తుల రాముడు, మండల సేవాదళ్ కన్వీనర్ పోతుల రాంబాబు, ఏఓ కె.ఏసుబాబు, సీఈఓ తోట రాంబాబు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కరవు మండలాలను పారదర్శకంగా ప్రకటించాలి

మండపేట: కరవుప్రాంత రైతుల వ్యవసాయ రుణాలను ప్రభుత్వం మాఫీ చేయాలని, రాష్ట్రంలోని కరువు మండలాలను పారదర్శకంగా ప్రకటించాలని పీసీసీ అధ్యక్షుడు గిగుడు రుద్రరాజు అన్నారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో డీసీసీ అధ్యక్షుడు కామన ప్రభాకరరావుతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా 742.22 మిల్లీమీటర్ల వర్షపాతం కురవాల్సి ఉండగా కేవలం 501.57 మిల్లీమీటర్ల వర్షపాతం కురిసిందన్నారు. వర్షాభావ పరిస్థితులతో ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో కరువు పరిస్థితులు నెలకొన్నాయని ఆయన పేర్కొన్నారు. కరువు పరిస్థితుల నుంచి రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రుద్రరాజు కోరారు. తొలుత మండపేట కార్యాలయానికి విచ్చేసిన రుద్రరాజుకు డీసీసీ అధ్యక్షుడు కామన ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. పార్టీ నాయకులు అరిగెల అరుణకుమారి, మహమ్మద్ ఇస్మాయిల్ అరీఫ్, వడ్డి నాగేశ్వరరావు, కోట శ్రీనివాస రావు, శివకోటి శేష సుబ్రహ్మణ్యం, మగ్గం జాకబ్ రాజు, కొడవల్ల వెంకట సుబ్బారావు, పిల్లి అప్పన్న, కొండ దుర్గారావు తదతరులు పాల్గొన్నారు

గ్రామాల స్వచ్ఛత.. మనందరి బాధ్యత

మంత్రి చెల్లుబోయిన వేణు



శివలలో ర్యాలీ నిర్వహిస్తున్న మంత్రి చెల్లుబోయిన వేణు

కె.గంగవరం: మన ఇల్లు ఎలా శుభ్రంగా ఉంచుకుంటామో అలాగే గ్రామాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలి.. ఇది మనందరి బాధ్యత అని రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపా కృష్ణ కోరారు. శివల గ్రామంలో సోమవారం స్వచ్ఛత మనందరి బాధ్యత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి చెల్లుబోయిన వేణు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఇళ్లల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు ఇతర వ్యర్థాలను వేరు చేసి పారిశుధ్య కార్మికులకు అందించాలన్నారు. గ్రామాల స్వచ్ఛత ఈ కార్యక్రమం విజయవంతానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించి, పారిశుద్ధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించారు. సర్పంచ్ అనుసూరి సాయి, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ ఇళ్లా సూర్యనారాయణ, మార్కెట్ కమిటీ చైర్మన్ పండు గోవిందరాజు, ఎంపీపీ నాగమణి, జెడ్పీటీసీ శ్రీవరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కందులపాలెంలో..

రామచంద్రపురం రూరల్: కందులపాలెం గ్రామంలో స్వచ్ఛత-మన బాధ్యత కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రి చెల్లుబోయిన వేణు పాల్గొని మాట్లాడుతూ సొంత ఇంటితో పాటు గ్రామాన్నీ శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పెంకే కృష్ణవేణి, ఎంపీటీసీ గుత్తుల అచ్యుతవేణి, ఉప సర్పంచ్ వెంటపల్లి రామకృష్ణ, మార్కెట్ కమిటీ చైర్మన్ పండు గోవిందరాజు, జెడ్పీటీసీ మేర్నీడి వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీ శాకా బాబీ, సర్పంచులు సూరిబాబు, అరుణ, ఏపీఐడీసీ డైరెక్టర్ శ్యామ్, ఎంపీడీఓ కీర్తి స్పందన, ఈఓపీఆర్డీ షలత్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రిలో సదుపాయాల కల్పన



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి వేణు

రామచంద్రపురం: స్థానిక ఏరియా ఆసుపత్రిలో మౌలిక సదుపాయాలు కల్పించడంతో రోగులకు వైద్య సేవలు సక్రమంగా అందుతున్నాయని రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. ఏరియా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం సోమవారం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న మంత్రి మాట్లాడుతూ ఆసుపత్రిలో అన్ని సదుపాయాలు ఏర్పాటు చేశారని, అందుబాటులో వైద్యులు ఉన్నారన్నారు. దీంతో అవుట్ పేషంట్ల సంఖ్య 25 శాతం పెరిగిందని తెలిపారు. రోగులకు నాణ్యమైన భోజనం అందించేలా నిరంతరం పర్యవేక్షణ ఉండాలన్నారు. ఎప్పుడూ వైద్యులు అందుబాటులో ఉండి సేవలందించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి ఆసుపత్రుల్లోనే వివిధ విభాగాలను పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. రోగులను పలకరిస్తూ ఆసుపత్రుల్లో అందుతున్న సేవలు అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి కమిటీ సభ్యులు తొగరి మూర్తి, చెల్లుబోయిన ప్రకాష్, వాసంశెట్టి లావణ్య, ఆసుపత్రి మెడికల్ సూపరింటిండెంట్, డి. వీరభద్రుడు, డాక్టర్ ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు సైన్స్ ఎక్స్‌పో ప్రారంభం

రాయవరం: గ్రామంలోని సాయితేజా విద్యానికేతన్‌లో సైన్స్ ఎక్స్‌పోను మంగళవారం ఉదయం ప్రారంభించనున్నారు. ఈ విషయాన్ని పాఠశాల అకడమిక్ డైరెక్టరు తేతల భానురేఖసందీప్ రెడ్డి సోమవారం విలేకరులకు తెలిపారు. విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు సైన్స్ ఎక్స్‌పో నిర్వహిస్తున్నామన్నారు. ఈ నెల తొమ్మిదో తేదీ వరకూ మూడు రోజుల పాటు జరిగే సైన్స్ ఎక్స్‌లో పవర్‌హబ్, బయో డైవర్సిటీ, మినీ మోడల్స్, అవర్ లైవ్లీహుడ్ అండ లాంగ్వేజ్ క్లబ్ కేటగిరీలను ప్రదర్శించనున్నట్టు ఆమె తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు కూడా సైన్స్ ఎక్స్‌పోలో ప్రదర్శనలు తిలకించవచ్చని తెలిపారు.

ఆస్పత్రికి వెళ్లి.. పింఛను అందించి..



ఆసుపత్రిలో ఆంజనేయులుకు పింఛను అందజేస్తున్న వలంటీర్ కామేశ్వరి

రాయవరం: చెల్లూరుకు చెందిన ఆంజనేయులు అనారోగ్యంతో కాకినాడ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ప్రతినెలా అందించే పింఛను సొమ్ము రూ.2,750లను వలంటీర్ మాసాబత్తుల కామేశ్వరి ఆసుపత్రికి వెళ్లి అందించింది.

పాదయాత్రలో ప్రతి అడుగు ఒక సంక్షేమ పథకమే..

- ప్రజా సంకల్పయాత్రకు ఆరేళ్లు
- గ్రామాల్లో వైఎస్సార్ సీపీ కార్యకర్తల సంబరాలు



కుయ్యేరులో కేక్‌ను కట్ చేస్తున్న పార్టీ నాయకులు

కాజులూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రతిపక్ష నేతగా ఆ నాడు చేపట్టిన పాదయాత్రలో ప్రతీ అడుగు ఒక సంక్షేమ పథకమై నేడు రాష్ట్ర ప్రజలకు సుపరిపాలన అందిస్తోందని డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ పెంకే సత్యనారాయణ అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పాదయత్ర చేపట్టి ఆరేళ్లు పూర్తయిన సందర్భంగా మండలంలో కార్యకర్తలు పార్టీ కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. కుయ్యేరు గ్రామ సచివాలయం ఆవరణలో సర్పంచ్ పిల్లి కృష్ణమూర్తి ఆధ్వర్యంలో మండల గృహసారథుల కమిటీ చైర్మన్ చింతపల్లి నాగేంద్రప్రసాద్ తదితరులు కేక్‌ను కట్ చేశారు. కాజులూరు శివారు చాకిరేవు మెరకలో డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ పెంకే సత్యనారాయణ ఆధ్వర్యంలోనూ, గొల్లపాలెంలోని కాజులూరు జంక్షన్ వద్ద పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పోతురాజు బాబూరావు ఆధ్వర్యంలోనూ కార్యకర్తలు వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ముఖ్యమంత్రి జగనన్న చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి, కేక్ కట్ చేసి స్థానికులకు పంచిపెట్టారు. చాకిరేవు మెరకలో జరిగిన కార్యక్రమంలో పెంకే సత్యనారాయణ తదితర నాయకులు మాట్లాడుతూ నాడు తెలుగుదేశం పార్టీ అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టేందుకు నవంబర్ ఆరు 2017న పాదయాత్ర చేపట్టిన జగనన్న 18 నెలల పాటు 3648 కిలోమీటర్లు కాలినడకన రాష్ట్రమంతా ప్రయాణించారన్నారు. అడుగడుగునా ప్రజల కష్టాలను గమనించి దానికనుగుణంగా సంక్షేమ పథకాలు రూపొందించి జనరంజిక పాలనను అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో గొల్లపాలెం పీఏసీఎస్ చైర్మన్ సత్తి శ్రీరామారెడ్డి, పార్టీ మండల సేవాదళ్ అధ్యక్షుడు టేకుమూడి దర్గారావు, రామచంద్రపురం మార్కెటింగ్ కమిటీ డైరెక్టర్ నల్లమిల్లి ఈశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల ఆమోదంపై హర్షం

రామచంద్రపురం: జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలను మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలపడంపై జర్నలిస్ట్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (జాప్) హర్షం వ్యక్తం చేసింది. ఇళ్ల స్థలాల కేటాయింపునకు కృషి చేసిన రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన వేణును జాప్ ప్రతినిధులు సోమవారం ఆయన నివాసంలో ఘనంగా సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. అక్రిడేషన్ల ప్రాతిపదికతోపాటు అర్హులైన వర్కింగ్ జర్నలిస్టులకు కూడా ఈ సదుపాయం వర్తించేలా చేయాలని కోరుతూ జాప్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పీఎస్ఎం కృష్ణంరాజు, నేషనల్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ ఎంఎన్ ఎస్ కనకాద్రి తదితరులు మంత్రికి వినతిపత్రం సమర్పించారు. దీనిపై మంత్రి వేణు సానుకూలంగా స్పందించి అందరికీ న్యాయం జరిగేలా చూస్తానన్నారు.

పేదల చెంతకే పథకాలు

- ఎమ్మెల్సీ తోట
- కేశవరంలో గడప గడపకూ మన ప్రభుత్వం



స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

మండపేట: పేదలు అధికారులు, నాయకులు, కార్యాలయాల వద్ద పడిగాపులు పడాల్సిన పనిలేకుండా గడప చెంతకే తమ ప్రభుతం సంక్షేమ లబ్ధిని చేరవేస్తోందని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. అందుకోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తెచ్చిన సచివాలయ, వలంటీర్ వ్యవస్థలు ఎంతో సమర్థవంతంగా పనిచేస్తున్నాయన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పార్టీ రాష్ట్ర కార్యదర్శులు కర్రి పాపారాయుడు, దూలం వెంకన్నబాబు, ఎంపీపీ వుండమట్ల శ్రీనివాస్, సర్పంచ్ పెదపాటి సత్యనారాయణ మూర్తి తదితరులతో కలిసి ఎమ్మెల్సీ తోట సోమవారం రాత్రి కేశవరంలో పర్యటించారు. గ్రామంలోని పలు ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి స్థానికులతో మాట్లాడారు. వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. స్థానికులు ఆయన దృష్టికి తెచ్చిన సమస్యలపై అధికారులతో మాట్లాడి పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. పేదల పక్షపాతిగా పనిచేస్తున్న సీఎం జగన్‌కు వచ్చే ఎన్నికల్లో ప్రజలు అండగా నిలిచి వైఎస్సార్‌సీపీని గెలిపించాలని ఎమ్మెల్సీ తోట విజ్ఞప్తి చేశారు. ఆర్‌బీకే మండల కమిటీ చైర్మన్ అన్నందేవుల చంద్రరావు, ఎంపీటీసీ సభ్యులు అన్నందేవుల కృష్ణారావు, చంద్రమళ్ల పోతురాజు, సొసైటీ చైర్మన్ ముక్కపాటి శ్రీనివాస్, పెదపాటి ఉమామహేశ్వరావు, పార్టీ నాయకులు కొప్పిరెడ్డి ప్రసాద్, మన్నే నారాయణమూర్తి, తుపాకుల ప్రసన్నకుమార్, మాచిరెడ్డి సురేష్, పెదపాటి శివయ్య, గంధం సూరిబాబు, అల్లంపల్లి కిషోర్, గనిశెట్టి సత్తిబాబు, గండిమేను గోవిందు, చుక్కా సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

రాయవరం మునసబు సేవలు చిరస్మరణీయం



రాయవరం మునసబుకు నివాళులర్పిస్తున్న మరిడియ్య తదితరులు

మండపేట: ప్రజాసేవే పరమావధిగా భావించే ఎంతోమంది ప్రజాప్రతినిధులను అందించి రాష్ట్రాభివృద్ధికి పాటుపడిన వుండవల్లి సత్య నారాయణమూర్తి (రాయవరం మునసబు) సేవలు చిరస్మరణీయమని రిటైర్డ్ ఆర్టీసీ ఉద్యోగి అడబాల మరిడియ్య అన్నారు. రాయవరం మునసబు 34వ వర్ధంతిని సోమవారం కేశవరంలో గ్రామ ప్రముఖుడు పెదపాటి ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. మరిడియ్య, ఉమామహేశ్వరరావు తదితరులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మరిడియ్య మాట్లాడుతూ రాష్ట్ర రాజకీయాల్లో తనదైన ముద్రవేసుకోవడం ద్వారా కింగ్ మేకర్‌గా, ఆంధ్రా టైగర్‌గా ఆయన పేరొందన్నారు. కూసు వెంకట్రావు, పెదపాటి సత్యం, వుండమట్ల శ్రీను, సాయిబాబా, మిర్తిపాటి శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

మునసబుకు ఘన నివాళి

రాయవరం: స్వర్గీయ వుండవిల్లి సత్యనారాయణ మూర్తి(రాయవరం మునసబు) 34వ వర్ధంతిని సోమవారం రాయవరంలో నిర్వహించారు. గ్రామంలో శ్రీరామయ్య జెడ్పీ ఉన్నత పాఠశాల, వెలంపేట రామాలయం, దళితపేట, చేనేత సహకార సంఘం వద్ద ఉన్న మునసబు విగ్రహాలకు అభిమానులు పూలదండలు వేసి నివాళులర్పించారు. ఎంపీపీ నౌడు వెంకటరమణ, సర్పంచ్ చంద్రమళ్ల రామకృష్ణ, గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ తేతల సుబ్బరామారెడ్డి, వైఎస్సార్ సీపీ నేత ఆర్‌వీవీ సత్యనారాయణచౌదరి, చాణక్య ఆస్పత్రి అధినేత డాక్టర్ జీఎస్ఎస్‌రెడ్డి తదితరులు నివాళులర్పించారు. కార్యక్రమంలో యోగా గురువు వెలగల ఫణికృష్ణారెడ్డి, మునసబు అభిమానులు మూర్తినీడి రాము, కొల్లి రాంబాబు, మల్లిడి వీర్రాఘవరెడ్డి తదితరులు మునసబుకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

బాస్కెట్‌బాల్‌లో విద్యార్థుల ప్రతిభ



క్రీడాకారులతో పాఠశాల హెచ్‌ఎం తదితరులు

రామచంద్రపురం: చిత్తూరు జిల్లా మదనపల్లిలో గత నెలలో జరిగిన 67వ పాఠశాలల క్రీడా సమాఖ్య అండర్-19 విభాగం బాస్కెట్ బాల్ పోటీల్లో కృత్తివెంటి పేర్రాజు పంతులు ప్రభుత్వ జాతీయోన్నత పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభను కనబర్చినట్టు ఆ పాఠశాల హెచ్‌ఎం టి.వీరరాఘవరెడ్డి సోమవారం విలేకరులకు తెలిపారు. పాఠశాల పదో తరగతి విద్యార్థులు జి.విజయసీతారామ్, జి.పృథ్వీరాజ్‌కుమార్ జిల్లా జట్టు ప్రథమ స్థానం సాధించడంతో ఉత్తమ ప్రతిభను చాటారన్నారు. ప్రతిభను కనబరిచిన విద్యార్థులను పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ వి.విజయకృష్ణ, పాఠశాల ఉపాధ్యాయులు అభినందనలు తెలియజేశారు.